నేడు ఎమ్మెల్యే పర్యటన

మంచాల, జనవరి 29 : మండలంలోని లింగంపల్లి, బండలేమూరు గ్రామాల్లో మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజమూరి రాంరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సీఐగా బాబ్యానాయక్

మంచాల, జనవరి 29 : మంచాల సీఐగా బాబ్యానాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేసిన కాశీవిశ్వనాథ్ నగరంలోని మీర్‌పేట పోలీస్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతన సీఐ బాబ్యానాయక్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. బాబ్యానాయక్‌ను ఎస్ఐ రవి నాయక్ తదితరులు స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారానికి నిధులు

మంచాల, జనవరి 29 : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి అత్యధిక నిధులు కేటాయించను న్నట్లు జడ్పీటీసీ మర్రి నిత్య అన్నారు. సోమవారం కాగజ్‌ఘట్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ మరమ్మతుల కోసం రూ. 2.65 లక్షలు, లోయపల్లి భూగర్భడ్రైనేజీ పనుల కోసం రూ. 2.25 లక్షలు, కొర్రవాని తండాలో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్డు పనుల కోసం రూ,3.10 లక్షల నిధులు ప్రొసీడింగ్‌లను స్థానిక ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాలకు నిధులు కేటాయించను న్నట్లు చెప్పా రు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు వాజీద్, నాయకులు మో హన్‌నాయక్, చంటి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- బూర్గులలో నూతన పశువైద్యశాల ప్రారంభం
- రాజకీయాలకతీతంగా పని చేయాలని అధికారులకు సూచన
- మహిళా సమాఖ్య భవనం ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్ : నూతనీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్, జనవరి 29 : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గుల గ్రామంలో నూతనంగా నిర్మించిన పశు వైద్యశాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడిపరిశ్రమ అభివృద్ధితో గ్రామాలు మరింత ప్రగతి పథంలో ముందుంటాయన్నారు. పశువైద్య శాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను కచ్చితంగా నెరవేర్చు తుందన్నారు. అంతకుముందు ఆయన కుందేలుకుంటతండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీపీ ఖాజాఇద్రిస్ అహ్మద్, జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్, సర్పంచ్‌లు అరుణ,రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

అధికారులు, పాలకులు సమస్యయంతో పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఖాజా ఇద్రిస్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని.. అధికారులు, పాలకులు రాజకీయాలకతీతంగా పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుంటాయన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు సర్పంచ్‌లు, ఆర్టీసీ అధికారులను అడుగగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే మరిన్ని కొత్త బస్సులు అందుబాటులోకి రాగానే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సర్పంచ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. సర్పంచ్‌ల పదవికాలం ముగిసినప్పటికీ వారికి రావాల్సిన బిల్లులను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సన్మానించారు. అదేవిధంగా పలువురు సర్పంచ్‌లను కూడా సన్మానించారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనీకరణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వినయ్‌కుమార్, పీఏసీఎస్ వైర్మన్ బక్కన్నయాదవ్, వైస్ ఎంపీపీ మౌనిక, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నందిగామ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ జె.కె.నర్సింహులు ఆధ్వర్యంలో రూ.10లక్షల జిల్లా పరిషత్ నిధులతో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ఎంపీపీ ప్రియాంకగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నదని, మహిళలకు వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. భవన నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన రవీందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కట్న లత, ఉప సర్పంచ్ సీతా రాములు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, జనవరి 29: బీఆర్ఎస్ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సోమవారం కొందుర్గు మండలంలోని అయోధ్యాపూర్ తండా, చిన్న ఎల్కిచర్ల, పులుసుమామిడి, పర్వతాపూర్, మహదేవపూర్, బైరంపల్లి, ఉత్తరాసపల్లి, ముట్పూర్, రేగడి చిల్కమర్రి, లాలపేట, ఉమ్మెంత్యాల గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపోటములతో నిమిత్తం లేకుండా బీఆర్ఎస్ ప్రజల కోసం పని చేస్తుందని చెప్పారు. కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో నీటి సమస్య రానివ్వొద్దు

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్‌టౌన్, జనవరి 29: రానున్న వేసవి కాలం దృష్ట్యా మున్సిపాలిటీలో నీటి సమస్య రానివ్వొద్దని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ సంబంధిత అధికారులు, వాటర్ లైన్‌మెన్లకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ అధికారులు, వాటర్ లైన్‌మెన్లతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పట్టణ ప్రజలు నీటిని వృథా చేయకూడదని కోరారు. ఇప్పటికే అన్ని వార్డుల్లో మిషన్‌భగీరథ పైపులైన్ ఏర్పాటు చేయడంతో పాటు నల్లా కనెక్షన్లను ఇచ్చినట్లు తెలిపారు. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే కౌన్సిలర్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసురావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, వాటర్ లైన్‌మెన్లు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుని పట్టణంలోని వినాయకగంజ్ గణపతి దేవాలయంలో సాయి మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఐ ప్రతాప్‌లింగం పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కిశోర్, శ్రీధర్, రాజేశ్, ప్రభు, అభిలాష్, వెంకటేశ్, చంద్రశేఖర్, అర్చకుడు వికాశ్‌శుక్ల, బుగ్గేశ్వర్ పాల్గొన్నారు.

దేవునిఎర్రవల్లిలో పంటల పరిశీలన

చేవెళ్ల రూరల్, జనవరి 29 : చేవెళ్ల మండల పరిధిలోని గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు, చీడ, పీడల రక్షణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. సోమవారం మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో పర్యటించి తెల్ల కుసుమ, క్యాబేజీ తదితర పంటలను పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో తులసి మాట్లాడుతూ.. రైతులు ఏ పంట పండించినా ప్రభుత్వం తరపున వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని విధాలుగా అవగాహన కల్పించి వారు అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలతో పంటలు పండిస్తే లాభాలు గడించవచ్చన్నారు. ఏవో వెంట వ్యవసాయ విస్తరణాధికారి రమేశ్, రైతులు చింపుల గోవర్ధన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే సమగ్రాభివృద్ధి

వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, జనవరి 29 : బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు, తండాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని ఏక్వాయిపల్లి గ్రామంలో నిర్మించిన వైకుంఠధామాన్ని సోమవారం స్థానిక సర్పంచ్ సుగుణ, ఎంపీటీసీ ఉమావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందన్న సంకల్పంతో గత ప్రభుత్వం గ్రామాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు వీరయ్య, వార్డు సభ్యులు భిక్షపతి, వెంకటేశ్, చంద్రయ్య, చోటే, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

శంకర్‌పల్లి :విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ సైదులు

శంకర్‌పల్లి, జనవరి 29 : ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోగల ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేనిది వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మహేశ్వర్‌రావు, ట్రాఫిక్ కానిస్టేబుల్ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు

హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలి

ఆమనగలు : వాహనదారులు రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్ నాయక్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమ నిబంధనలు విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్, డాక్యుమెంట్ లేకుండా, మధ్యం సేవించి వాహనాలు నడిపే వారికి ఈ -చానల్ ద్వారా జరిమానా వేస్తున్నట్లు వివరించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదం చేస్తే బండి ఓనర్లపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అవగాహన

చేవెళ్ల రూరల్ : జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా చేవెళ్లలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై స్థానిక ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎవరూ కూడా త్రిబుల్ రైడింగ్‌లో వెళ్లకూడదని సూచించారు. కార్యక్రమంలో పాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

చర్లగూడలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, జనవరి 29: గ్రామాలను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. చిన్న పంచాయతీల ద్వారా అభివృద్ధి జరుగుతుందనే ఉద్దేశంతో మండలంలో 12 కొత్త గ్రామ పంచాయతీలను నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వాటిలో నూతన పంచాయతీ భవనాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కౌకుంట్ల పుష్పమ్మ, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అశోక్, యాదగిరి, రాజేశ్, రాజు, వెంకటయ్య, జంగిలి, చంద్రయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

చేవెళ్లలో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశానికి మండల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. సోమవారం జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 41 గ్రామ పంచాయతీల నుంచి పార్టీ శ్రేణులు వాహనాల్లో చేవెళ్లకు తరలివెళ్లారు. అనంతరం చేవెళ్లలోని షాబాద్ చౌరస్తాలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు వెంకటయ్య, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చాంద్ పాషా, దర్శన్, మల్లేశ్, భూపాల్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రాసీడింగ్ అందజేత

కడ్తాల్, జనవరి 29 : కడ్తాల్ గ్రామంలో వడ్డెర కులస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు మంజూరు చేసిన రూ.5 లక్షలకు సంబంధించిన ప్రొసిడింగ్‌ను సోమవారం వడ్డెర సంఘం నాయకులకు సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి అందజేశారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, వార్డు సభ్యులు భిక్షపతి, రామచంద్రయ్య, నాయకులు యాదయ్య, జంగయ్య, శ్రీనివాస్, బాలయ్య, నర్సింహ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీనీ అమలు చేస్తాం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

బలిజగూడ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 29 : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బలిజగూడ, బాచారం, బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాల్లో రూ. 2.59 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ బుర్ర రేఖ, జడ్పీటీసీ బింగి దాస్‌గౌడ్‌తో కలిసి సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ముందు ప్రజలు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు రేషన్‌కార్డులు, పింఛన్లు రాని వారందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. అనుమతులు లేకుండా క్రషర్ యజమానులు పేలుళ్లు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బలిజగూడలో బస్సు సౌకర్యం కల్పించాలని, సర్వేనం 55,56 భూ బాధితులకు పట్టాలు ఇవ్వాలని, శ్మశాన వాటికకు దారి చూపించాలని కోరారు. త్వరలోనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు బుర్ర వీరస్వామిగౌడ్, పారంద సంతోష, కవాడి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు దంతూరి అనిత, కేశెట్టి వెంకటేశ్, ఉపసర్పంచ్‌లు ఉప్పు సురేశ్, మోర ప్రభాకర్, నెమరుగోముల స్వామి, కొలన్ శేఖర్‌రెడ్డి, నాయకులు కొత్త ప్రభాకర్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

షాద్‌నగర్, జనవరి 29 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, బీఆర్ఎస్ పాలనలో పూర్తైన భవనాలను ప్రారంభిస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షోపుటప్ చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షుడు హఫీజ్ అన్నారు. సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌పై అనవసర విమర్శలు మానుకోవాలని, లేకుంటే గుణపాఠం తప్పదన్నారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో రైతు సమన్వయ సమితి మాజీ కో ఆర్డినేటర్ వజ్రలింగం, సర్పంచ్ బాబురావు, ఎంపీటీసీ మానయ్య, నాయకులు ప్రేమ్, శివ, మాళి, రవి, వెంకటేశ్, గణేశ్, చెన్నయ్య, జహంగీర్, మల్లేశ్, శ్రీను, లక్ష్యయ్య, సందీప్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో నేడు పూజలు

చేవెళ్ల రూరల్, జనవరి 29 : చేవెళ్ల మండల కేంద్రంలోని వేంకటేశ్వరాలయంలో మంగళవారం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీవారి తిరుమల మహా పాదయాత్ర (41 రోజుల)లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు శ్రీమద్భగవద్గీతా (18 అధ్యాయాలు, 700 శ్లోకాలు) పారాయణం, సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం లక్ష్యసాధన ఫౌండేషన్ నిర్వహణలో గట్టు అరుంధతి రంగాచార్యుల పర్యవేక్షణలో జరుగనుందన్నారు.

గూడూరు కాశీ విశ్వేశ్వరాలయంలో చోరీ

- గడ్డపార సహాయంతో ప్రధాన ఆలయంలోని తలుపులు ధ్వంసం

కొత్తూరు, జనవరి 29: గూడూరు కాశీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ జి శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కాశీ విశ్వేశ్వరాలయంలో పూజారి మడుపతి మల్లికార్జునశర్మ సోమవారం ఉదయం పూజలు ప్రారంభించడానికి ఆలయానికి వెళ్లాడు. అక్కడ ప్రధాన ఆలయం తెరిచి ఉండటం చూశాడు. అక్కడ ఉన్న రెండు హుండీలను ఎవరో ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. రెండు హుండీలను గడ్డపారతో పెకిలించి పొలాల్లోకి ఎత్తుకెళ్లారు. ఊరు అవతల వ్యవసాయ పొలంలో వాటిని బద్దలు కొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఉత్సవిగ్రహాలను కూడా ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆలయాన్ని ఏడాది క్రితం రూ. కోటి రూపాయలు వెచ్చించి అత్యంత సుందరంగా నిర్మించారు. అయితే గుడి నిర్మాణం జరిగిప్పటి నుంచి హుండీని తెరువలేదని గుడి చైర్మన్ ఉప్పల దయానంద్‌గుప్తా చెప్పారు. అందులో సుమారు రూ.30 వేల వరకు ఉండొచ్చని సర్పంచ్ బ్యాగరి సత్తయ్య వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీ శ్రీనివాస్ తెలిపారు.

పాలమూరు-రంగారెడ్డితో సాగు నీరందిస్తాం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అన్మాస్‌పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, జనవరి 29 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ పోతుగంటి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర వీరస్వామిగౌడ్, ఎంపీటీసీ దర్శన్‌గౌడ్, ఎంపీడీవో వినయ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేశ్, డాక్టర్ శ్రీను, వార్డు సభ్యులు శ్రీనూనాయక్, శ్రీరాములు, జాన్యానాయక్, మానస, సుశీల, మంజుల, మైసమ్మ, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు బీచ్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, హన్మానాయక్, చందోజీ, యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ, భిక్షపతి, శేఖర్‌గౌడ్, కృష్ణ, బిక్కానాయక్, లాయక్‌అలీ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేత

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జడ్పీటీసీ మాలతీకృష్ణారెడ్డి

చేవెళ్ల రూరల్, జనవరి 29 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జడ్పీటీసీ మర్పల్లి మాలతి అన్నారు. మండల పరిధిలోని చేవెళ్ల, అంతారం, కౌకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సయ్యద్ అక్బర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.